# రెండు చెట్లు

— డాక్టర్ రావూరి భరద్వాజ


## ఒక మర్రి చెట్టు కథ

**కొంతమంది పుట్టకముందే చనిపోతారు. ఇంకొంతమంది పుడుతూ పుడుతూనే చనిపోతారు. మరికొంతమంది పుట్టాక, కొంతకాలం ముద్దుగా పెరిగాక, చనిపోతారు. వీరందరి మరణాలూ మనకు దుఃఖ శోకాలే అవుతాయి.**

కొంతమంది మరణించడం, మనకెంత విచారాన్ని కలిగిస్తుందో, మరి కొంతమంది జీవితం అంతకన్నా మించిన విచారాన్ని కలిగిస్తుంది. 'పదికాలాలపాటు పచ్చగా బతకడం ఆనందంగా ఉంటుం'దను కోవడం ఒకప్పుడు నిజమే కావచ్చు గానీ, ఇప్పుడు మాత్రంకాదు.

ప్రతి మనిషి చేయవలసిన పనులూ కొన్ని ఉంటాయి. ఆ పనులు చేయడం కోసం వారు అవతరిస్తారు. ఆ పనులు చేయడం కోసం వారు నానా అవస్థలూ పడతారు. ఒక్కోసారి రోజుల కొద్దీ నిద్రాహారాలకు దూరం కావలసి ఉంటుంది. ఒక్కోసారి, ఆత్మీయులం దరకూ దూరం కావలసి ఉంటుం ది. ఒక్కోసారి - తనకు తనే - దూరం కావలసి ఉంటుంది.

ఇన్ని అవస్థలూ పడి, ఆ పనులేవో పూర్తి చేశారనుకోండి. మామూ్మలుగా అయితే, సంతోషంతో చప్పట్లు చరుస్తారు. ఒక మాదిరిగా అయితే చిరు నవ్వులు చిలికిస్తారు. ఈ మధ్య అదీ తగ్గిపోయింది. ఒక వస్తువుతో పని తీరిపోయాక, దానిని మూలకు గిరవాటేసినట్లే, ఒక వ్యక్తితో మనకున్న పనులన్నీ తీరిపోయాక, ఆ



వ్యక్తినొక మూలకు గిరవాటేస్తారు. అంతదాకా రాకముందే, ఆ వ్యక్తిగారే ఓ మూలకు పొదిగి పోయారనుకోండి; మరికా సిని రోజులు బతుకుతారు. కాకుండా, బిర్రబి గుసుక్కూచున్నా రనుకోం డి; అసలుకే మోసం వస్తుం ది.

నాకీ విషయాలన్నీ జ్ఞాపకం రావడం వెనుక చాలా కోణాలున్నాయి. వాటినన్నింటినీ సత్తతం గుచ్చి చెప్పేటంత వ్యవధి నాకు లేదు. వినేంత వ్యవధి మీకూ లేదు.

ఒకప్పుడీ పరిసరాల్లో పచ్చని పొలాలుండేవి. పొలం గట్ల మీంచి నడుస్తూ ఉంటే, ఆకుపచ్చని సరోవరంలో ఈదుకొంటూ పోతున్నట్టుగా ఉండేది. ఊరికి - కొంచెం దూరంగా కొండ; దాని దిగువన చెరువు; దాని కట్ట మీద పెద్ద ఊడల మర్రి - దాని చుట్టూతా పొలాలూ - గాలి కూడా ఆకుపచ్చగానే ఉండేది.

అలాంటిదిప్పుడు, ఆ పొలాలన్నీ అదృశ్యమయ్యాయి. రకరకాల పూరికొంపలు, రేకుల కొంపలు; చిత్తువత్తుగా వెలిశాయి. అక్కడెవరుంటున్నారో తెలుసుకొందామని నాలుగడుగులు వేశాను. అంతమంది వయోవృద్ధులు ఒక్కచోట గుమిగూడి ఉండడం, నాక్కొంచెం వింతగానే అనిపించింది. అక్కడున్న వారందరికీ కాదుగానీ, చాలామందిని అడిగి చూశాను. వారందరూ కాందిశీకులేనని తేలింది. వారందరూ వారివారి ప్రాంతాల్లో నిరాశ్రయులేనని తేలింది. వారందరూ - సంతానవంతులేనని తేలింది. ఆ సంతానానికి, వీరితోగల అవసరాలు తీరిపోయాయి కాబట్టి వీరినీ కాందిశీకుల శిబిరాల్లోకి తోసిపారేశారు. కొందరి బంధువులేమో అప్పుడప్పుడు కల్సిపోతుంటారుట. కొందరికి ఆపాటి అదృష్టం కూడా లేదుట. కనిపెంచిన ప్రేమల్నీ, అభిమానాల్నీ చంపుకోలేక, వీరెప్పుడన్నా తమవారి దగ్గరకెళ్ళినా - వీధుల్లోంచో, వరండాల్లోంచో తమ వారిని చూసి వెనుతిరిగి రావలసిందేనట.

వీరిలో - నాకు బాగా తెలిసిన వారూ, ఒక మాదిరిగా తెలిసినవారు కూడా ఉన్నారు. ఒకప్పుడు - వీరందరూ, మధ్యందిన మార్తాండులే! ఇప్పుడు మాత్రం - అస్తమయ సూర్యులయిపోయారు. వీరిని చూస్తుంటే మనస్సంతా వికలమయిపోయింది. తిరిగి వొచ్చేప్పుడు నా పాత నేస్తం, ఊడలమర్రి కనిపించింది. చూస్తూనే, దానికీ ముసలితనం వచ్చిందనుకొన్నాను. దాని కొమ్మల నిండా, చిత్తవత్తుగా గూళ్ళున్నాయి. ఆ గూళ్ళ నిండా చిన్నా పెద్దా పక్షులున్నాయి.

దాని నీడల కింద, చాలా కుటుంబాలు కనిపించాయి. ఆ కుటుంబాల్లో ముసలివారూ, వయసువారూ, పసివారూ కనిపించారు. వారిలో కొందరు అక్కడే పుట్టి, అక్కడే పెరిగి, అక్కడే వేరు కుంపట్లు పెట్టుకొన్నవారూ ఉన్నారు.

'ఇంత అమానుషత్వాన్ని చూస్తూ ఎలా బతికున్నావ్?' అన్నానా ముసలి మర్రి వేపు చూస్తూ.

'నా కొమ్మల్లోనూ, నా కొమ్మల కిందా బతుకుతున్న వారికింత నీడ దొరికాక వారూ నన్నేదన్నా వృద్ధాశ్రమానికి పంపేస్తారు బాబూ!' అన్నదా మర్రిచెట్టు దిగులు దిగులుగా!

## ఒక పూల చెట్టు కథ

నాకా ప్రాంతమంటే చాలా ఇష్టం. అందుక్కారణం, నేను బాగా ఇష్టపడేవారు - ఒకప్పుడా ప్రాంతంలో ఉండేవారు. వారి మీది అభిమానం కొద్దీ, వారింకా అక్కడే ఉన్నారన్న నమ్మకాన్ని గట్టిపరుచుకొంటూ, నేనా ప్రాంతాన్ని ప్రతిరోజూ దర్శిస్తూ ఉంటాను. నేనిష్టపడే వారిప్పుడు, అక్కడ లేరు. కానీ - ఒకప్పుడు - ఆ పరిసరాలతో నేనేర్పర్చుకున్న ఆప్యాయతలూ, అనుబంధాలూ మాత్రం ఇప్పటికీ చెక్కుచెదరకుండా, అట్లానే ఉన్నాయి.

అక్కడున్నవన్నీ నాకిష్టమే గానీ, అన్నింటికన్నా, ఆ మూలగా ఉన్న పూలచెట్టంటే నాకు మరీ ఇష్టం! ఆ ఇష్టానికూడా చాలా కారణాలున్నాయి. అందులో ముఖ్యమైన కారణమేమిటంటే - ఆ ప్రాంతంలో నేను బాగా ఇష్టపడే ఓ బంగారు తల్లికి మూలగా ఉన్న ఈ పూల చెట్టంటే చాలా ఇష్టం. ఏ మాత్రం అవకాశమున్నా ఈ పూల చెట్టు దగ్గరే కూచునేవారు. ఏపాటి వ్యవధి దొరికినా, ఈ పూల చెట్టుతోటే కబుర్లు చెబుతుండేవారు. పండగలొచ్చినా, పబ్బాలొచ్చినా ఈ పూల చెట్టునే అలంకరించేవారు. ఈ చెట్టు పూలతోనే ప్రభువును పూజించేవారు. ఈ చెట్టు ఆకులనే, పత్రిగా ఉపయోగించేవారు. కారణమేమిటని, అపుడెపుడూ నేనా బంగారుతల్లిని అడగనూ లేదు; ఆమెగారు చెప్పనూ లేదు. తెలుసుకొందామని, నాకూ లోలోపల లేకపోలేదు గానీ, అవతలి వారు తమంతతాముగా ఏ సంగతీ చెప్పందే, నా అంతట నేనుగా అడగడం మర్యాదగా ఉండదన్న అభిప్రాయంతోనే, నేనెప్పుడూ, ఈ పూలచెట్టు విషయాన్ని ఆమె దగ్గర ప్రస్తావించలేదు.

సరే-

ఇప్పుడేమో ఆమెగారు లేరు. కానీ - ఆమె మిగిల్చిపోయిన తీయని జ్ఞాపకాలున్నాయి. అద్భుతమయిన గుర్తులున్నాయి. మిగిలిన వారందరకూ, ఆమెగారు అదృశ్యమయినా, నాకు మాత్రం ఇంకా దృశ్యంగానే మిగిలిపోయారు. ఆ - దృశ్య సంవీక్షణం కోసమే, నేను ప్రతిరోజూ అక్కడికెడుతూ ఉంటాను.

ఆ పొలాలన్నీ అదృశ్యమయ్యాయి. రకరకాల పూరికొంపలు, రేకుల కొంపలు; చిత్తువత్తుగా వెలిశాయి. అక్కడెవరుంటున్నారో తెలుసుకొందామని నాలుగడుగులు వేశాను. అంతమంది వయోవృద్ధులు ఒక్కచోట గుమిగూడి ఉండడం, నాక్కొంచెం వింతగానే అనిపించింది. అక్కడున్న వారందరికీ కాదుగానీ, చాలామందిని అడిగి చూశాను.

నిన్న సాయంకాలం ఆ చెట్టు నిండా మొగ్గలున్నాయి. ఉదయానికల్లా ఆ మొగ్గలన్నీ పూవులుగా విడిగా విప్పారుతాయనీ, పరిమళ భారంతో తొక్కిస మక్కిసలాడే పూలనూ, పుష్పభారంతో అలకిపోయిన, ఆ చెట్టునూ తనివారా చూదామనీ, రాత్రంతా అనుకొంటూనే ఉన్నాను.

తోవ పొడవునా - ఆ పూలచెట్టు గారిని అడగవలసిన ప్రశ్నలన్నింటినీ, పోటీకి పదిసార్లు మననం చేసుకున్నాను.

తీరా - ఇక్కడికొచ్చి చూస్తే, ఆ చెట్టు బోసిగా కనిపించింది. దాని కొమ్మలకొక్క పూవూ లేదు. దాని రెమ్మల కొక్క మొగ్గా లేదు.

నాకేమో, పేగులు కత్తి దించుకుపోయినట్టుగా ఉంది. ఆ చెట్టు మాత్రం, చాలా మామూ్మలుగా ఉంది. 'నిన్ను చాలా కాలంగా చూస్తున్నాను. సంతోషిస్తున్నాను. నీవంటే - ఆమెగారికి చాలా ఇష్టం. దానిక్కారణం నాకూ తెలీదు. ఆమెకిష్టమయినవన్నీ నాకూ ఇష్టమే గనక, నీవన్నీ నాకిష్టమే. నీ పూలేమయ్యాయో చెప్పు. వాటిని కోసుకెళ్ళిన వారిని'' అంటూ ఇంకా ఏదో అనబోతున్నాను.

ఆ చెట్టు - నన్ను వారించింది.

'నేను ఓ దిక్కూమొక్కూ లేని దాన్ని బాబుగారూ! గింజగా - ఏ పక్షికో ఆహారం కావలసిన నన్ను పూలమొక్కగా, ఆ బంగారుతల్లి పెంచి పెద్ద చేసింది. ఆ తల్లిగారే లేకపోతే - నేనేమయి ఉందునో ఊహించడానికే భయం వేస్తున్నది... అదే బాబూగారూ! అసలు విషయాని కొస్తున్నాను. గడచిన వారం రోజులుగా నేను దాచుకొన్న మొగ్గలన్నింటినీ, గత రాత్రి పూతగా మార్చుకొన్నాను. వేకువనే వెళ్ళి, ఆమెగారి జన్మదినోత్సవ కానుకగా, నా కాసిని పూలతోనూ అమ్మగారిని అభిషేకించి, వచ్చాను' అన్నదా పూలచెట్టు.

బహుశా - నేను - ఏడ్చి ఉండాలి. లేకపోతే, దాని ఆకులు నా కళ్ళనెందుకు తుడుస్తాయి. ☆